
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 జూన్ 2023





చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు : ఆరేళ్ల లోపు లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎం. హరినారాయణన్ సర్వ శిక్ష అభియాన్, ఐసిడిఎస్, వైద్యాధికారులకు సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సర్వ శిక్ష అభియాన్ , ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులతో, వైద్యశాఖ అధికారులతో, ఎన్ఆర్. హెచ్. ఎం. అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందించాల్సిన సేవలను గుర్తించి చర్చించారు. వీరిని గుర్తించడానికి అంగన్‌వాడీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు సహకారం తీసు కోవాలన్నారు. సర్వ శిక్షా అభియాన్ పి డి, ఉషారాణి, ఐసి డి యస్ పిడి , సౌజన్య డి ఇ ఒ, గంగాభవాని, డి ఎం హెచ్ ఒ డాక్టర్ వెంకట ప్రసాద్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ డి. ఆలీ, ఐఎపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబు, రెడ్ క్రాస్ సెక్రెటరీ మస్తానయ్య, ఎన్ఆర్‌హెచ్‌ఎం డాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

కౌలు రైతు రక్షణ కోసం కదం తొక్కుతూ..!

నేటి నుంచి జీపు యాత్ర

కౌలు చట్టాన్ని సవరించాలని నడుంకట్టిన రైతులు

రాష్ట్రంలో భూమిని నమ్ముకొని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తోన్న కౌలు రైతుల రక్షణ కోసం కౌలు రైతు సంఘం నడుంభిగించింది. కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న రైతులు పెద్ద పోరాటానికి సిద్ధమయ్యారు. నేటి నుంచి నెల్లూరు నుంచి జీపు యాత్ర ప్రారంభంకానుంది. 10,11,12 తేదీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పాదయాత్రలతో ప్రభుత్వాన్ని నిలదీయడానికి సిద్ధమయ్యారు. మారిన జీవన విధానంతో ఎక్కువ మంది నిరుపేదలు కౌలు రైతులుగా మారుతున్నారు. వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలు అందడం లేదు. కౌలు రైతు చట్టాన్ని సవరించి, భూయజమాని సంతకం తొలగించాలని ప్రధాన డిమాండ్‌తో ఈ ఉద్యమం సాగుతోంది..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ వ్యవసాయం రంగంలో అనేక మార్పులు వచ్చాయి. పెరిగిన ధరలు, వ్యవసాయం ఇబ్బందులుగా మారడం, పిల్లల చదవుల కోసం వందలాది కుటుంబాలు పల్లెలు వదిలి, పట్టణాలకు వలసలు వెళుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో ఉంటే చిన్నపాటి భూములను అక్కడ ఉండే నిరుపేదలకు కౌలుకు ఇస్తున్నారు. ప్రభుత్వ విధానాలు, ధరల పెరుగుదల, రుణ పరపతి లేక, ప్రకృతి వైపరీత్యాలు, పంటల బీమా లేకపోవడం, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందకపోవం, వ్యవసాయంలో పెరిగిన ఖర్చులతో కౌలు రైతులకు కనీసం పెట్టుబడి చేతికి రావడం లేదు. గతంలో కౌలు రైతుల రుణ అర్హత కార్డులు, సాగు ధ్రువీకరణ పత్రాలు, ఉండేవి. ప్రభుత్వం కొత్తగా ఒక్క కలం పోటుతో కౌలు రైతుల జీవితాలపై దెబ్బకొట్టింది. భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు (సిసిఆర్‌సి) ఇస్తామనే కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. భూమిలో కష్టపడే కౌలు రైతులకు అనుకూలంగా యజమానులు వ్యవహరించడం లేదు. కౌలు రైతులకు కార్డులు అందుబాటులోకి రావడం లేదు. ఈ కార్డులు లేని కారణంగా పంట రుణాలు, పంటల బీమా, పరిహారం, రైతు భరోసా వంటి ఏ సదుపాయం కౌలు రైతులకు అందడం లేదు. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ధాన్యం అమ్ముకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. పసుపు, వరి, జొన్న, మొక్క జొన్న, పంటలకు మద్దతు ధర రాలేని పరిస్థితి వచ్చింది. దేశానికి అన్నం పెడుతోన్న రైతుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా అనేక ఉద్యమాలు సాగాయి. ఢిల్లీ రైతాంగ ఉద్యమం, ముంబయ్ రైతుల మహా పాదయాత్ర, ఇలాంటి ఉత్తేజకరమైన పోరాటాలు ఇటీవల కాలంలో సాగాయి. కౌలు రైతులకు న్యాయమైన చట్టాలు అమలు జరగాలని కౌలు రైతు సంఘం మరో పోరాటానికి సిద్ధమైంది. కౌలు రైతులు ముందుకొచ్చి విజయ వంతం చేయాలని ఆ సంఘ నేతలు కోరుతున్నారు.



జాతాకు సిద్ధం చేసిన జీపు

నేటి నుంచి జీపు యాత్ర..!

కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి జీపు యాత్ర ప్రారంభం కానుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఉదయం 9 గంటలకు నెల్లూరు రూరల్ మండలం, పొట్టే పాళెంలో ప్రారం భిస్తారు. ఉదయం 10 గంటలకు పెనుబల్లి, 11గంటలకు బుచ్చిరెడ్డి పాళెం, 12 గంటలకు దామరమడుగు, 3 గంటలకు కోవూరు, 4 గంటలకు యల్లాయపాళెం, 5 గంటలకు విడవ లూరులో ముగుస్తోంది. రాత్రికి ఒంగోలు బయల్దేరి వెళుంది. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాధాకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల గురునాధం, తుళ్లూరుగోపాల్, పాల్గొననున్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ - జాతాకు ఘన స్వాగతం



రూరల్ నియోజకవర్గంలో యాత్రకు ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రతిపక్ష హోదాలో వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని ఆర్భాటంగా హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక విస్మరించారని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం విమర్శించారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు, సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, 010 పద్దు ద్వారా వేతనాలు అందజేయాలన్న డిమాండ్స్‌తో మే 31వ తేదిన హిందూపురంలో ప్రారంభమైన జాత గూడూరు నుంచి అయ్యప్పగుడి సెంటర్ మీదుగా మంగళవారం నగరానికి చేరుకుంది. అయ్యప్ప గుడి సెంటర్‌లో సిఐటియు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ప్రజాసంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. నాగభూషణం మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించకపోగా ఆప్కాసు విధానం తెచ్చి 60 ఏళ్లకు ఇళ్లకు పంపించే ప్రయత్నం దుర్మార్గమన్నారు. గత రెండు నెలల నుంచి మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ అందజేసిన దాఖలాలు లేవన్నారు. ఈ సమస్యల మీద అనేక దఫాలుగా ఆందోళన చేసిన ఫలితం లేకపోవడం వలన పోరాటానికి సిద్ధపడుతున్నా మన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల యొక్క న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జరిగే పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర నాయకులు కె. నాగేంద్రబాబు, నాగరాజు, గోపి, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, సిఐటియు రూరల్ అధ్యక్ష కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, మున్సి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, దేశ మూర్తి, వజ్రమ్మ సిఐటియు నాయకులు బత్తల కిష్టయ్య పాల్గొన్నారు.

నగరంలో జాతాకు ఘన స్వాగతం

మున్సిపల్ కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఏదైతే హామీలు చేసి ఉందో వాటన్నింటినీ అమలు చేయాల్సిందేనని, మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. గత నెల 31వ తేదీన ప్రారంభించిన జాత మంగళవారం నగరానికి చేరుకుంది. గూడూరు నుంచి అయ్యప్పగుడి సెంటర్‌కు చేరుకున్న ఈ జాతను నగరంలోకి మున్సిపల్ కార్మికులు ఆహ్వానించారు. అధిక సంఖ్యలో చేరుకున్న మున్సిపల్ కార్మికుల భారీ ప్రదర్శనతో నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకుంది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఏపీ మున్సిపల్ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు హిందూపురం నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు రెండు జాతాలు పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు సైతం వెనకాడబోమని అన్నారు. వైసిపి ప్రభుత్వం గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనర్సయ్య గుర్తు చేశారు వజిల్లా పరిధిలోని కార్పోరేషన్, మున్సిపాలిటీల్లో కార్మికల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి జి. నాగేశ్వరావు, మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామాక్షమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. ఎం సునీల్, అశోక్, నాయకులు డేనియల్, లోకేష్, మారుతీ, క్రిష్ణ, చినబాబు,కొండమ్మ, భాగ్యమ్మ,సలోమి, డి. వై. ఎఫ్. ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, సీఐటీయూ నగర నాయకులు మూలం. ప్రసాద్, ఆర్. శ్రీనివాసులు ఉన్నారు.



మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం

భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో మంజూరైన సాగునీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్‌తో కలసి కలెక్టర్ జిల్లాలో మంజూరైన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, సోమశిల హై లెవెల్ లిఫ్ట్ కెనాల్ ఫేజ్ -1, ఫేజ్-2 ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వ, డికేటి, చుక్కల భూముల భూ సేకరణ ప్రక్రియ పై నిర్దిష్టమైన గడువును నిర్ధారించుకొని ఆ గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా దష్టి సారించాలన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్.ఈ హరినారాయణ రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ వేంకటేశ్వర రావు, తెలుగు గంగ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ హర్షం

ప్రజాశక్తి-నెల్లూరు : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంత్రి వర్గ కమిటీ సమావేశం నిర్వహించి, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సుముఖత తెలిపేందుకు సిద్ధమవ్వడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని ప్రైవేట్ భవనంలో ఏపి ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. దీర్ఘకాలికంగా రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ఈ వార్త సంతోషా న్నిస్తుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం అహర్నిశలు కషి చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి, జనరల్ సెక్రెటరీ అరవ పాల్‌కి ఎపిజి,ఇఫ్ ఉమ్మడి నెల్లూరు జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు, జనరల్ సెక్రెటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, హంస జనరల్ సెక్రెటరీ కమల్ కిరణ్, ఎపిటిఎస్ఎ జిల్లా నాయకులు రెహమాన్, ఖాదర్ వలీ, వి.రాజేష్ బాబులు ధన్యవాదాలు తెలిపారు.

యువతకు శిక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు : మార్కెట్లో డిమాండ్ ఉన్న వత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్లో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న వత్తి నైపుణ్య కోర్సులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపయోగపడే వత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఏసీ, ఫ్రిడ్జ్ మెకానిక్, ప్లంబింగ్, డ్రైవింగ్, జేసీబీ, క్రేన్ ఆపరేటింగ్, పెయింటింగ్ మొదలైన కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి వినీల్ కుమార్, డి ఆర్ డి ఏ పీడీ సాంబశివారెడ్డి, గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, జేఈవో భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కె ఎమ్‌డి డి రఫీ కందుకూరులో పలు వాహనాలనుతనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రైలర్ మీడియం గూడ్స్ తదితర వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్, టాక్స్ కట్టని కారణముగా వాటికీ జరిమానా 44, 640 విధించినట్లు తెలిపారు.

పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : 'ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం పేదల కోసం కందుకూరులో ఊరిబయట నివా సం ఉండే వద్ధులను, వికలాంగులను గుర్తించి వారికి భోజన ప్యాకెట్లు అందిం చారు. సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు అని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ తెలిపారు. ప్రెసిడెంట్ సాజిద్,ట్రెజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్ పఠాన్, షంషుదీన్, పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని, ప్రతీ దుకాణం వద్ద డస్ట్ బిన్ లను నిర్వాహకులు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. మంగళవారం పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా ములుముడి బస్టాండ్ కూడలి, చిన్న బజార్, పెద్ద బజార్, రాయాజి వీధి, సండే మార్కెట్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం స్థానిక చిన్న బజారులో పండ్ల షాపుల నిర్వాహకులతో కమిషనర్ నేరుగా మాట్లాడుతూ పండ్ల ప్యాకింగ్ పేపర్లను డ్రైను కాలువల్లో వేయరాదని, ప్రతీ దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్ లను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. డస్ట్ బిన్ లను ప్రజలకు కనిపించేలా షాపుల ప్రాంగణాల్లో ఉంచి, అవసరమైన వారు తప్పనిసరిగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, టి.పి.ఆర్.ఓ ప్రసాద్, సూపర్ వైజర్లు శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, సచివాలయం శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయంపై

స్థానిక ప్రజా ప్రతినిధుల ధ్వజం

ప్రజాశక్తి - గుడ్లూరు : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుడ్లూరు మండలంలో విద్యుత్తు సరఫరాలో తరచుగా అంతరాయం కలుగుతుందని ఫలితంగా రక్షిత నీటి పథకాలు పనిచేయక తాగునీటి సరఫరా రోజుల తరబడి ఆగిపోయిందని ప్రజాప్రతినిధులు విద్యుత్ అధికారులపై ధ్వజమెత్తారు. మండలంలోని చేవూరు గుడ్లూరు పాజర్ల పొట్లూరు తదితర గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు పనిచేయకుండా ఆగిపోయాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పులి రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జెడ్‌పిటిసి బాపిరెడ్డి మాట్లాడుతూ అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి సమస్యకు పరిష్కారం చూడాలని కోరారు. ఇంకా కొట్లూరు సర్పంచి సుబ్బరాజు, చేవూరు ఎంపీటీసీ సభ్యులు నక్కల శ్రీనివాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పచ్చి రొట్ట విత్తనాలు మంజూర య్యాయని, రైతులు సబ్సిడీపై తీసుకెళ్లేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ చంద్రసేన్, గుడ్లూరు సర్పంచ్ పి శంకర్ మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

వైసిపిలో భారీగా చేరికలు

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు

పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపికి పట్టుగా ఉన్న తోటపల్లిగూ డూరు మండలం సౌత్ ఆము లూరులో ఎట్టకేలకు వైసిపి పతాకం ఎగరనుంది. టిడిపి చెందిన వంద కుటుంబా లకు పైగా వైసీపీ తీర్థం పుచ్చు కున్నాయి. గ్రామంలో 90 శా తానికిపైగా ప్రజలు మాజీ ము ఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక వర్గానికి చెందిన వారు. దీంతో పార్ల మెంట్, అసెంబ్లీ, చివరికి స్థాని క సంస్థల ఎన్నికల్లో సైతం టిడిపికి ఏకగ్రీవంగా అవుతూ వస్తోంది. నేపథ్యంలో వైసీపీ రా ష్ట్ర కార్యదర్శి, విజయ డైరీ మాజీ అధ్యక్షులు చిల్లకూరు సుధీర్ రెడ్డి తీసుకొన్న చొరవ వల్ల గ్రామంలో వైసీపీకి కాస్తంత గుర్తింపు లభించినట్లయింది. దశాబ్దాలుగా టిడిని ముఖ్య నేతలు తమ అనుచ రులతో కలసి సోమవారం రా త్రి ఆ పార్టీని వీడి మంత్రి కాకా ణి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ మేరకు వా రికి మంత్రి గోవర్ధన్ రెడ్డి వైసీపీ కండువాలు కప్పి, స్వాగతించా రు. చిల్లకూరు సుధీర్ రెడ్డి, మండల ఉపాధ్య క్షులు చెరుకూరు శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.



మంత్రి కాకాణి సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి నాయకులు

జగనన్న కాలనీలలో

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : మానుగుంట

ప్రజాశక్తి -కందుకూరు

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న కాలనీలలోని గహనిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంఎల్ఎ ఎం మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు వలేటి వారిపాలెం లింగసముద్రం గుడ్లూరు. ఉలవపాడు మండలాల ఎంపిడిఒలు, విద్యుత్. ఆర్‌డబ్ల్యుఎస్, మెప్మా సంబంధిత శాఖల అధి కారులతో మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ హాజరై మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గంలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలలో జరుగుతున్న అలసత్వం పై ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి అసంతప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ నెల్లూరు జిల్లా పిడి. నరసిం హులు.. పబ్లిక్ హెల్త్ ఈఈ. ఆలీ . డి ఎల్ డి ఓ. పద్మజ. మున్సిపల్ కమిషనర్ మనోహర్... హౌసింగ్ ఇంచార్జ్ డిఇ శ్రీని వాసరావు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

మరుగుదొడ్ల పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని సామాజిక, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను అత్యంత ప్రణాళికాబద్ధంగా చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దే విధముగా చర్యలు చేపట్టబడుతున్నాయి అని కమిషనర్ వికాస్ మర్మత్ తన పర్యటనలో తెలియచేసారు. నగరంలోని సంతపేట, ములుముడి బస్టాండ్, ఆర్.ఆర్ స్ట్రీట్, కుసుమ హరిజన వాడ, గాంధీ నగర్, ఆత్మకూరు బస్టాండ్, కొత్తహాల్ వెనక ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రజా మరుగుదొడ్లను మంగళవారం కమిషనర్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రూపొందించిన టాయిలెట్ 2.0 కార్యక్రమంలో భాగంగా నూతన మరుగుదొడ్ల నిర్మాణం, మరుగుదొడ్లలో వసతుల కల్పన ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఈ.ఈ చంద్రయ్య, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



భూ రీ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో జరగనున్న రీ సర్వే పనులలో అత్యాధునిక డిజిటల్ డ్రోన్ సేవలను వినియోగించుకుని రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లు, సచివాలయాల వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారిపై దాడులు సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి సరైన సమాధానం చెప్పే విధంగా ప్రభుత్వ పాలన కొనసాగించాలే తప్ప దాడులకు పాల్పడటం దారుణమని, టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డిపై నగరంలో ఆదివారం జరిగిన దాడి హేయమైనదని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమా వేశంలో ఆనం వెంకటరమణారెడ్డి పై జరిగిన దాడిని సిపిఐ నాయ కులు ఖండించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్,షానవాజ్, మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై సమాధానం చెప్పే విధంగా ఉండాలే గాని ప్రశ్నించారని దాడి చేయించడం విష సంస్కృతి ఇలాంటి విష సంస్కృతిని ఎ రాజకీయ పార్టీ కూడా సమర్థించదన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజీజ్, అహ్మద్, వెంకటేశ్వర్లు, సుల్తాన్ ఉన్నారు.

వారోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - పొదలకూరు : పట్టణంలోని మారుతీ నగర్‌లో వెలసి ఉన్న వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతి అనంతర వారోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. హనుమజ్జయంతి అనంతరం కొన్ని వారాల పాటు ప్రతి మంగళవారం ప్రత్యేక వారోత్సవాలను నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆన వాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా నాలుగవ మంగళవారం పొదలకూరు మండలం రెడ్డి జనసేవా సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు మంచిపెట్టారు. భోజనపల్లి గోపాల కష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కంది పంట దిగుబడికి సూచనలు

ప్రజాశక్తి -పొదలకూరు

కంది సాగులో రైతులు మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని పొదలకూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ వాసు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బిరదవోలు, కళ్యాణపురం గ్రామాల్లో సాగులో వున్న కంది పంటలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంది పంటను ఖరీఫ్, రబీ లలో సైతం సాగు చేయవచ్చున్నారు. నీటి శాతం తక్కువగా వున్న నేలలో సైతం మరియు మెట్ట భూమిలో సైతం సాగు చేయవచ్చన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో, రైతు భరోసా కేంద్రాల్లో మినీ కిట్ల ద్వారా కంది విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఎఓ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-వరికుంటపాడు

వ్యవసాయశాఖ మండల అధికారిగా వనమ రవికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కందుకూరు ఎడిఎ కార్యాలయంలో టెక్నికల్ ఎఓగా ఉండి ఉద్యోగోన్నతిపై వరికుంటపాడు ఎఓగా నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎఓ కిరణ్ అతని స్థానంలోకి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా నూతన ఎఓ వనమ రవికుమార్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకాన్ని వారికి అవగాహన కల్పిస్తామన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి ఓపెన్ క్లస్టర్‌ను నిర్వహించగా రైతులు 877పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 792బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 62పొగాకు బేళ్లను తిరస్కరించారని, అధిక బరువుతో ఉన్న 23పొగాకు బేళ్లను వేలా నికి తిరస్కరించారని తెలిపారు. వీటిలోఎఫ్ ఎస్ 35, ఎన్‌బి 04ఆర్ ఆర్ 01ని ఆర్22ఉన్నాయన్నారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.212, కనిష్ఠ ధర రూ.170, సగటు ధర206.83నమోదు కాగా, వేలంలో 10మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారన్నారు.

ఎస్ఐకు సన్మానం



ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఇంద్రసేనారెడ్డిని మంగళవారం వైసిపి నాయకులు ఇత్తడి రమణయ్య శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఇంద్రసేనారెడ్డి స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి స్థలం టెండర్‌కు 8న ఆఖరు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని ఆర్‌టిసి డిపో ఆవరణలో ఉన్న 5450 చదరపు అడుగుల ఖాళీ స్థలం (బిట్-2) 15 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడానికి టెండర్లకు ఆఖరు 8వ తేదీ నిర్ణయించినట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా ప్రకటనలో తెలిపారు. ఈ స్థలానికి టెండర్లకు దరఖాస్తు చేసేవారు రూ.5,900 నగదును ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరికొన్ని వివరాలకు కోసం www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌ను ఉపయోగించాలని తెలిపారు. లేదా ఆత్మకూరు ఆర్‌టిసి డిఎం నెంబర్‌ను 9959225645 సంప్రదించాలన్నారు.

చేవూరి గంగయ్యకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-కావలి

విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలోని పరిశోధనా విద్యార్థి చేవూరి గంగయ్యకు మంగళవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. గుడ్లూరు మండలం చేవూరు గ్రామంకి చెందిన గంగయ్య అర్థశాస్త్ర విభాగంలో 'గ్రామీణ యువత ఉపాధి పై ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి పథకాల ప్రభావం' అనే అంశం పై అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గానూ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం చేవూరి గంగయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సహ పరిశోధనా విద్యార్థులు చేవూరి గంగయ్యను అభినందించారు.

పేదలకు అన్నదానం



ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని బుడంగుంట గిరిజన కాలనీలో నివసిస్తున్న కడునిరుపేదలకు 'మీకోసం" స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్ కుమార్ రాయపాటి ఆధ్వర్యంలో అమెరికా నివాసి కట్టానోయల్ రాజ్ కుమారుడు అలెన్ పాల్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చికెన్ బిర్యాని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్ కుమార్ రాయపాటి మాట్లాడుతూ నోయల్ స్ఫూర్తిప్రదమైన సేవా గుణం కలిగిన వ్యక్తిగా ఆయన కుమారుడు అలెన్ పుట్టిన రోజు వేడుకలు పేదల మధ్య జరపడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షులు కుందుర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మీకోసం సేవాసంస్థ అనేక కుటుంబాలలో వెలుగులు నింపే ధ్యేయంతో ముందుకెళుతుందని తెలిపారు. కట్టా ఫ్యామిలి అంటే సేవకు మారుపేరైన త్యాగరాజు, బాలరాజు వారసులైన నోయల్ కుమారుడు అలెన్ పాల్ పుట్టినరోజు సెలబ్రేషన్స్‌ను ఆడంబరాలకు పోకుండా పేదల కడుపు నింపడంస్ఫూర్తిదాయక విషయమని ఇటువంటి కార్యక్రమాలను మీకోసం సంస్థ ద్వారా చేయడం సంతోషకరమన్నారు. మీకోసం సేవాసంస్థ గౌరవ సలహాదారులు మాలకొండారెడ్డి మాట్లాడుతూ కట్టా.అలెన్ పుట్టిన రోజును ఇటువంటి కాలనీలలో జరిపడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పి.నవీన్ కుమార్, జనరల్ సెక్రటరీ ఆవులమంద శ్రీనివాసులు, సెక్రటరీ డానియేల్ బాబ్జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒంగోల్ సంతోష్ కుమార్, నికిత్, అలెన్ సోదరులు రాజేష్, ఆరెన్, రహమన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- కావలి చేరిన మున్సిపల్ ప్రచారజాతా

ప్రజాశక్తి - కావలి

రాష్ట్రంలో మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వారికి సి.పి.ఎస్. రద్దు చేయాలని, పాతపెన్షన్ ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సభ్యులు ఎం.లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కావలి పట్టణానికి మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచారజాతా కావలికి వచ్చిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగరపంచాయతీల్లో 40వేలమందికిపైగా ఆప్కాస్ సిబ్బంది, మరో 10వేలకు పైగా సి.పి.ఎస్. ఉద్యోగులు, 1000మందికి పైగా క్లాప్ ఆటో డ్రైవర్లు పని చేస్తున్నారని తెలిపారు. వీరందరూ రాష్ట్ర జనాభాలో 40శాతంగా ఉన్న పట్టణ ప్రజలకు పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, పార్కులు, పౌరసేవలు



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

అందిస్తున్నారని తెలిపారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న ఇలాంటి మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఎన్నికలకు ముందు పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తానని వాగ్దానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాటే మరిచాడని విమర్శించారు. ఆయన ఇచ్చిన హామీల అమలుకు పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం, 010 పద్దు ద్వారా జీతాలు, ఉద్యోగాల పర్మినెంట్, సిపిఎస్ రద్దు కోసం ప్రతి ఒక్కరూ కదలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ ప్రచారజాతాకు కావలిలో మున్సిపల్ కార్మికులు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.నాగేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.టి.ఎం.నాగరాజు, గోపి, జిల్లా కార్యదర్శి కె.పెంచలనర్సయ్య, పిఎన్ఎం కళాకారులుక్రిష్ణవేణి, పుల్లయ్య, రామాంజనేయులు, స్థానిక సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, వై.కృష్ణమోహన్, బి.క్రిష్ణయ్య, యూనియన్ అధ్యక్షులు తురకశీనయ్య, కార్యదర్శి బి.మహేష్, నాయకులు బాబు, శివకోటయ్య, జేమ్స్, ఒంగోలు రమేష్, మహిళా నాయకురాలు చిన్నమ్మ, నారాయణమ్మ, మహేశ్వరి, అనూరాధ, లక్ష్మీదేవి, కార్మికులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అల్లూరు

వ్యవసాయ రైతుల కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా విఎఎలు రిజిస్టర్ చేయాలని కావలి ఎడిఎ నాగరాజు తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు అనేక మెళకువలు పాటించాలని కోరారు. మెమో పిప్పి పలు తెగుళ్లకు సంబంధించి అనేక విషయాలు కూలంకుషంగా తెలియచేశారు. ఈక్రాప్ నమోదు కారణంగా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. గతంలో తాను సూళ్లూరుపేటలో విధులు నిర్వహించి కావలికి బదిలీ అయినట్లు తెలియజేశారు. రైతులకు సంబంధించి ఎలాంటి సలహాలు సందేహాలు ఉన్నా వెంటనే సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

కేరళ తరహా సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఆటో కార్మికులకు కేరళ, తమిళనాడు తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సిఐటియు కార్యాలయంలో ఇందుకూరుపేట మండలం ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్టాండ్ దయాసాగర్ ఎస్.కె.చాన్ భాషాల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు టివివి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, ఈ చలానా పోలీస్ వేధింపులు అధికంగా ఉన్నాయని ఇలాంటి పరిస్థితులను ఆటో కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ ఆటో కార్మికులు యూనిఫారం ధరించి ఐడెంటిటీ కార్డుతో ఆటో పేపర్స్ ఫోర్సులో ఉంచుకోవాలని, మద్యం సేవించి ఆటో డ్రైవ్ చేయరాదని ఆటో డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.మురళి, ఆటో యూనియన్ కమిటీ సభ్యులు మనోహర్, నరసింహ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌తో చిన్నారులకు ఉపయోగం



ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం లోని గ్రంథాలయంలో గత నెల నుండి జరుగుతున్న సమ్మర్ క్యాంప్ నిర్వహణ చిన్నారులకు ఎంతో ఉపయోగ పడుతాయని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం శిక్షణ తరగతులకు వచ్చే విద్యార్థులకు నీతి కథలు, తెలుగు భాష గురించి చెప్పడానికి అన్వర్‌బాషాను గ్రంథాలయ లైబ్రేరియన్ నారాయణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు, తెలుగు వ్యాకరణం గురించి తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకొని రాబోయే విద్యాసంవత్సరంలో ఈ సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న వాటిని ఆయా తరగతులలో వచ్చే పాఠ్యాంశాలలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అలాగే విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించే చక్కని అవకాశం విద్యార్థులకు దొరికిందన్నారు. లైబ్రరీలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్న లైబ్రేరియన్ దివానపు నారాయణను అభినందించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో 30 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

సచివాలయాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని కరటంపాడు, బోయలచిరువెళ్ల, వాసిలి, గ్రామ సచివాలయాల్లో మంగళవాం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 0-6 పిల్లలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు ఇచ్చేటట్లు, పిఎం ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ కోసం లబ్ధిదారులు నుండి దరఖాస్తులు సేకరించి సేకరించిన దరఖాస్తులు బ్యాంకులకు అందేటట్లు గృహ నిర్మాణం వేగవంతంగా అయ్యేటట్లు చూడాలని సచివాలయ సిబ్బందికి వలంటీర్లకు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంకయ్య, ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలని రిలే దీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రతినెలా ప్రభుత్వ ఉద్యోగస్తులకు జీతాలు సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం మండల నాయకులు ఒక్కరోజు రిలే దీక్ష చేపట్టారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం మండల నాయకులు చేపట్టి పలువురు నాయకులు మాట్లాడుతూ సి.పి.ఎస్.ను రద్దు పరచి ఒ.పి.ఎస్.ను పునరుద్ధరించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీనే జీతభత్యాలు చెల్లించేలా చిట్టం చేసి 23-11-1993 కంటే ముందు నియమితులైన ఎస్.ఎమ్.ఆర్. వైలీవేజెస్ ఇంటిండెంట్ ఉద్యోగుల ను తక్షణమే కన్యులదైత్ చేయాలన్నారు. అన్ని శాఖలలో డి.ఎస్.సి. ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 11వ పి.ఆర్.సి. అమలు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలలో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డి.ఎ. అరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ సంఘం నియమించకుండానే ఉద్యోగ సంఘాలతో నేరుగా సంప్రదింపులు జరిపి 12వ వేతన సవరణను ఉద్యోగులు దాచుకున్న సొమ్ము జి.ఎస్. ఎ.పి.జి.ఐ. భద్రత కల్పించాల న్నారు. పదవీ విరమణ గావించిన ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజునే అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదలచేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశపరచి సమస్యలు చర్చించాలన్నారు. ఇంకా 200 డిమాండ్ల సాధనకై ఉద్యమ కార్యాచరణ ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ జావీద్, తాలూకా ప్రెసిడెంట్ కొండారెడ్డి, ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, సెక్రటరీ సర్దార్ అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఉద్యోగసంఘాల నాయకులు

సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా..

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి-నందవరం డబుల్ రోడ్డు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకురి చిరంజీవి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని ఇన్‌స్టిట్యూట్‌లో వైసిపి నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలు సమస్యలు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని తన దృష్టికి తెచ్చారు. పట్టణంలో ఉన్న కోనకాలువ ఉదయగిరి ప్రాంత ప్రజలకు నీటిదాహార్తి తీర్చే సంజీవని లాంటి నీరని, ప్రస్తుతం ఈ నీరు సరిగా రాకపోవడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎంపి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. అలాగే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సులు, అంబులెన్స్, ఆక్సిజన్ తదితర సమస్యలు తీర్చేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అలాగే దిలావార్ బావి వీధిలోవున్న హౌసింగ్ బోర్డు కాలనీకి సంబంధించి ఇళ్లను ప్రభుత్వానికి పనికొచ్చే విధంగా మార్చడానికి కృషి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన మెట్టుకూరి సంబంధిత అధికారుల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను త్వరితగతిన పూర్తి అయ్యేందుకు కృషి చేస్తా హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముర్తుజాహుసేన్, మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి కాలేషా, అనీల్, రఫి, మట్ల రామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్టుకూరి చిరంజీవిరెడ్డి



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-దగదర్తి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని చెన్నూరు ఎస్‌టి కాలనీ అరుంధతీయవాడలో తిమ్మారెడ్డి పాలెంలో గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాడు ధనవంతుడు లాగా ఉండాలని ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఏకైక నాయకుడని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఒక పని కావాలంటే కార్యాలయం చుట్టూ కాళ్లు అడిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లోని సచివాలయం ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ప్రజల కష్టాలు తీర్చాడని వారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తాళ్లూరు వెంకట ప్రసాద్ నాయుడు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, చెన్నూరు వైసిపి సీనియర్ నాయకులు పి.అనిల్ రెడ్డి, ఎంపిడిఒ విజయ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సీతారామపురం : మలేరియా వారోత్సవాలలో భాగంగా మంగళవారం సీతారామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ కిటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, పైలేరియా మొదలగు వ్యాధులు దోమ కాటు వల్ల సంభావిస్తాయని దోమకాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే - ఫ్రై డే కార్యక్రమం ప్రతి ఒక్కరూ సక్రమంగా నిబద్ధతతో నిర్వర్తించాలని తద్వారా దోమల అభివృద్ధిని నిరోధించవచ్చనే సూచనలిస్తూ, రాత్రి వేళల్లో దోమతేరలు వాడటం శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వాడటం దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా తలుపులు, కిటికీలకు మెస్ వాడటం మంచిదన్నారు. కార్యక్రమంలో గురించి సిహెచ్ఒ మంజులమ్మ, ఎంపిహెచ్ఇఒ ఎస్‌కె.మజీద్, ఎంపిహెచ్ఎలు తిరుపాల్ రెడ్డి, దుగ్గిరెడ్డి, ఎఎన్ఎంలు ఆశాలు తదితులున్నారు.



మాట్లాడుతున్న అన్వర్‌బాషా

ఆశావర్కర్లకు రూ.26వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతసాగరం

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో ఆశా వర్కర్లకు సిఐటియు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘానికి బలం సభ్యత్వం, కావున ప్రతిఒక్క ఆశ వర్కర్ సిఐటియు సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. ఆశా వర్కర్ల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు అని తెలియజేశారు. ప్రభుత్వాలు ఆశ వర్కర్లమీద విపరీతమైన పనిభారం పెంచి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీల, ధనమ్మ, జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిలో సంజీవని ఆరోగ్యరథం

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధిలోని ఎర్రబెల్లి గడ్డ కాశీనాయన సెంటర్‌లో మంగళవారం సంజీవిని ఆరోగ్య రథంతో గ్రామంలోని ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 132 మందిని డాక్టర్ అవసరమైన వారికి ఈసీజీ రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 102 మందికి కంటి పరీక్షలు వైద్యులతో చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శకునాలపల్లి మాజీ సర్పంచులు కేశవ నారాయణ, పోతుల ప్రభాకర్ రెడ్డి, ఆర్లపడే సర్పంచ్ పెండ్యాల మాధవరావు, మాజీ



సర్పంచ్ వాడుకప్ప మాల్యాద్రి యాదవ్, మోహన్ రెడ్డి, కొండప నాయుడు, రావులపల్లి నరసయ్య, పోలగిరి మహేష్, చింతల వెంకటేశ్వర్లు, వెంకట నరసయ్య, మహేష్, కొండేటి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



'సంయుక్త' ఆధ్వర్యంలో

చిన్నారి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి

విదేశాల్లో ఉంటున్న డాక్టర్ బి.రాజేంద్ర ప్రసాద్ - రాధ దంపతులు సంయుక్త సేవాసంస్థ ద్వారా సంరక్షిస్తున్న చిన్నారి టి.సాయి దుర్గ పుట్టినరోజును మంగళవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఇంట్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర,పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి సాయి దుర్గ, సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలు పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారి టి.సాయి దుర్గ పుట్టినరోజును తమ ఇంట్లో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రభుత్వ సంపద దోపిడీ

- చోద్యం చూస్తున్న అధికారులు
- పత్తాలేని రెవెన్యూ, మైనింగ్ శాఖ

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని సింగపేట పంచాయితీ పరిధి మూర్తిరాజు సంఘం, అలాగే తిప్ప గురుకుల పాఠశాల వెరకాలవున్న సిజెఎఫ్ఎస్ ప్రభుత్వ భూముల్లో వైసిపి నాయకులు దర్జాగా పాగా వేసి అక్రమ గ్రావెల్ దందాను కొనసాగిస్తుంటే, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సింగపేట రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 1లో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకపోయినా దర్జాగా సంపదను కొల్లగొడుతున్నారు. సిజెఎఫ్ఎస్ భూముల్లో మైనింగ్ చట్ట విరుద్ధం కాగా అంతా దోచుకు వెళుతుంటే అధికారులు కళ్లు లేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యక్షంగా ప్రభుత్వ ఉద్యోగులే మామూళ్ల మత్తులో ఊగిసలాడుతున్నారని ప్రజలు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. దగదర్తి మండల ఓ ఎంపిటిసి అధికార పార్టీ అండదండలతో కీలక భూమిక పోషిస్తూ విలువైన సంపదను అంతా దోచుకు వెళు తున్నారని ఘంటాపథంగా ఆరోపిస్తున్నారు. ఆ నేత కనుసనల్లో గ్రావెల్ సంపదకు రక్షణ లేకుండా పోతుందని పలువురు వెల్లడిస్తున్నారు. దోపిడీదారుడైన ఆ అధికార పార్టీ నాయకుడి అక్రమాలను ప్రశ్నించే నాథుడు కరువయ్యారని పలువురు వాపోతున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక అనుమానాలకు



సిజెఎఫ్ఎస్ భూముల్లో అక్రమంగా తరలించిన గ్రావెల్ ప్రదేశం

తావిస్తోందని ఆగ్రహంతో ఊగిపోతున్నారు. యంత్రాలతో అందిన కాడికి దోచుకుని భారీగా గోతులు తీసి కోట్ల రూపాయల సంపదను తన జేబులో వేసుకుంటున్నారని తెలియజేశారు. ఆ ప్రజాప్రతినిధికి ఎర్ర మట్టి కనబడితే రాత్రి-పగలు తేడా లేకుండా టిప్పర్లలో ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడని తెలుపుతున్నారు. గ్రావెల్ సంపదను దోచుకుంటున్న తరుణంలో ఆ వ్యక్తిని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారఅహంతో బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రావెల్ తీసిన ప్రదేశాలు ఇప్పటికే చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో భారీ వాహనాల కారణంగా ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న తరుణంలో అధికారులు మౌనం వీడి గట్టి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి **మాట్లాడుతూ** అధికార పార్టీని అడ్డం పెట్టుకుని అధికార పార్టీ ఎంపిటిసి అక్రమాలకు పాల్ప డ్డారని విమర్శిం చారు. అనేక గ్రామాల్లో గ్రావెల్ తరలించడంలో అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆయన అన్నారు. సిజెఎఫ్ఎస్ భూముల్లో ప్రభుత్వ సంపదను దోచుకు వెళు తూ ఉంటే రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు గానా బజానా చేయడం దురదృష్టకర మన్నారు. ఆ నేతపై సుమోటోగా కేసు నమోదు చేయా లని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఆ నేతకు వెన్నుదున్నుగా ఉన్న అధికారులపై విచారణ చేపట్టి ప్రభుత్వ సంపదకు న్యాయం చేయాలని కోరారు.



ఈ సందర్భంగా జిల్లా గిరిజన మహిళా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడుతూ అధికార పార్టీ ఎంపిటిసిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల స్మశానాలను సైతం వదలకుండా దందా సాగించి గ్రావెల్ సంపదను దోచుకు వెళ్లాడని ఆరోపించారు. ఎవరైనా అతని ప్రశ్నిస్తే దాడులు చేయడం ఆయన నైజమని ఆమె అన్నారు. ఈ దుర్మార్గాలపై కలెక్టర్, కావలి ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. గిరిజన గ్రామాల్లో తరలించిన గ్రావెల్ దందాపై అధికారులు సమాధానం చెప్పాలని లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.



వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఆత్మకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి రాములు వాహనాలను తనిఖీ చేశారు.అధిక లోడుతో వెళ్తున్న లారీ, మూడు ట్యాక్సీలకు అపరాధ రుసుం విధించి సీజ్ చేశారు.